పల్లెటూరి వైద్యము

తాత కృష్ణమూర్తిగారు, బి.ఏ; ఎల్.టి.

"......మనకి యింగ్లీషు చదువు అబ్బి రాదని పోరిపోరి చెబితే విన్నావు కావు. మా పెద్దన్న దిబ్బావుధాన్లు కొడుకుని యింగిలీషు చదువుకు పార్వతీపురం పంపించేసరికి పుష్టంవొచ్చి మూడ్రోజుల్లో కొట్టేశింది. బుచ్చబ్బి కొడుక్కి యింగ్లీషు చెప్పిద్దాం అనుకుంటూండగానే చచ్చినంత ఖాయిలా చేసింది."

—కన్యాశుల్కము.

దినేదినే జ్వరం తీవ్రం కాజొచ్చింది. ఒంటిమీద స్మారకం లేకుండా ఉష్ణం పొక్కిపోసింది. కుఱ్ఱవాడు బ్రతుకుతాడా లేదా అన్న భయం పట్టుకుంది మా నాన్నకి. చదువుకోసమని చెప్పి నన్ను పరాయిఊరు పంపించడం యింత చేసిందని మా నాయనమ్మ సాధింపు. నా ఉష్ణంమాట అలా ఉండగా, యింట్లో రోజూ మానాన్నకీ, నాయనమ్మకీ వివాదం!

"తల్లిలేని పిల్లణ్ణి, చదువుపేరుపెట్టి అడవిలో పారేసినట్లు యెక్కడికో పంపిస్తే వాడు బెంగ పెట్టుకున్నాడు కాబోలు. పసిపిల్లవాడిని పశువును బాదినట్లు కొట్టడానికి వాడి కెలా చేతులొచ్చాయో? ఈ అయ్యవార్లకు పిల్లలుండరు కాబోలు! గొడ్డుముండాకొడుకులకు దయాదాక్షిణ్యా లుండవు" అంటూ మా నాయనమ్మ కళ్లవెంబడి నీళ్లు తెచ్చుకునేది.

"అమ్మా,......యిప్పుడు విచారించి యేం లాభం? మనవాళ్లు ఉన్నారుకదా అని పర్లాకిమిడి పంపించాను; వస్తూ పోతూ ఉండడానికి దగ్గిరకదా అని. ఇట్లా వస్తుందని నే నేం కలగన్నానా? ఎన్నాళ్లని వీడిని బడికి పంపకుండా ఊరుకోగలం? మొగపుట్టుక పుట్టినతరవాత కుఱ్ఱవాడు చదువుకోక తప్పదుకదా? నానా శ్రమదమాలు పడాలి. కష్టసుఖాలకు ఓర్చుకోవాలి. వీడి అన్నలు చదువుకోవడం లేదూ మరి, దూరస్థలాలలో?" అని మానాన్న యేదో సమాధానపరచేవాడు.

"నాయనా, మన పుల్లయ్య ప్రయోజకుడు కావడం నాకుమాత్రం ముచ్చటకాదూ? ఈ యింగ్లీషు విద్య చదువుకుంటేనే కాని, వాడి పొట్ట వాడు పోషించుకోలేడా యేవిటి? ప్రయోజకత్వం అంటే నాలుగురాళ్లు గణించుకోవడం, నలుగురికీ ఉపచరించడం, లోకానుభవం సంపాదించడం, మంచివాడనిపించుకొని బ్రతకడం! అంతేకాని, యిల్లూ వొళ్లూ గుండ చేసుకొని, మెట్టుదాకా చదివి, గుమస్తానౌకరికి తల అమ్ముకొని అఘోరించడమనేది ప్రయోజకత్వ మనిపించుకోదు. మన పూర్వులంతా అప్రయోజకులేనా యేమిటి? వాళ్లు చదువుకోలేదూ? ఈ యింగ్లీషు చదివితేనేకాని విద్య అనిపించుకోదా యేమిటి? నిజంగా ఆలోచిస్తే, యీ స్కూళ్లచదువు సర్కారునౌకరికి తప్ప మరెందుకైనా పనికి వస్తుందీ?......పోనీ, ఏదో ఒక చదువు చదువుకోనీ అనుకుంటే, యిదేమి టీ అన్యాయం? పిల్లవాడిమీద తనకేమి హక్కు ఉన్నదని, ఆ మాస్టరు యిట్లా కొట్టడం? చదువు చెప్పడమంటే చావ దన్నడమనా అర్థం?" అని ముసలమ్మ యెదురు తిరిగేది.

"విద్యనేర్పడానికి గురువు శిక్షించడం తప్పు కాదు; కాని శిక్షించడమే విద్యనేర్పడ మనుకోవడం చాలా తెలివి తక్కువ."

రెండోరోజున మానాన్న, నాయనమ్మ యీ విధంగా వాదంపెంచి, మాట్లాడుకుంటూఉంటే మాఅమ్మ (సవతితల్లి) వెళ్ళి, మీరిట్లా వాదించుకంటూ కూచుంటే, పిల్లవాడి జ్వరం ఏంకాను?

వైద్యుణ్ణి పిలిపించండి. అబ్బాయిస్థితి యేమీ బాగు లేదు. పలవరిస్తున్నాడు. ఇప్పుడొక వాంతి అయిందికూడా," అని చెప్పింది.

తక్షణమే కంబారినిపిలచి మానాన్న కబురు పంపినాడు సూరన్నకి. ఆచుట్టుప్రక్క గ్రామాలకంతా అతగాడు పేరుపొందిన వైద్యుడు. వెళ్లిన మనిషితో ఆయన, "ఇప్పుడు వచ్చేందుకు తీరుబడి లేదు. రెండోపూట వస్తానని చెప్పు." అని చెప్పినాడట. అప్పుడు స్వయంగా మానాన్నే బయల్దేరి వైద్యుడియింటికి వెళ్ళినాడు.

"అయ్యా, సూరన్నగారూ, ఇప్పుడు రావడానికి తీరుబడిగాలేదని సెలవిచ్చారట. ఎలాగైనా వీలుచేసుకొని, శ్రమఅనియెంచక, రావలసిందని నా ప్రార్థన. కుర్రవాడికి యేమీ బాగులేదు. తమరొక సారి దయచేసి, చెయ్యి చూస్తేనేకాని కాదు."అంటే

"ఫరవాలేదండి. కొంచెం జ్వరం తగిలితే తెలిసినవారైకూడా మీరు అధైర్యపడడం భావ్యం కాదు. ఇప్పుడు నాకు కొద్దిగా జరూరుపనిఉంది. తెరిపిచేసుకొని, మధ్యాహ్నంవచ్చి చూస్తానులెండి." అన్నాడట సూరన్న.

"తమరట్లా సెలవిస్తే ధర్మమా? ఒక్కక్షణం తెరిపిచేసుకొని యిప్పుడు దయచెయ్యాలి." అని మానాన్న ప్రాథేయపడినాడట.

"భక్తగారూ, మీకు చాదస్తంకాని జరూరుపని మీద ఉన్నానని మనవిచేస్తే నమ్మరుకదా!...సరే లెండి. తమరు వెళ్ళండి. ఇప్పుడే వస్తాను." అన్నాడట సూరన్న.

సాధ్యమైనంత త్వరలో రావలసినదని మరీమరీ ప్రార్థించి, మానాన్న వైద్యుడివద్ద సెలవు పుచ్చుకున్నాడు. కాని సూరన్న యెంతసేపటికీ రాలేదు. నాకు జ్వరం ఏమీ తగ్గలేదు. మాఅమ్మ నామంచం దగ్గిర కళ్లనీళ్లుపెట్టుకొని కూచుంది. నాయనమ్మకి వంటతోచక, నిమిషనిమిషానికీ గది గుమ్మందగ్గిర నిల్చుని తొంగిచూస్తూ, "అబ్బాయికి ఎలాఉంది?" అని అడుగుతూ ఉండేది. వైద్యుడు రాలేదని మానాన్నమనసు దాగట్లోపడిన వెలగకాయవలె పరిపరివిధాల దొర్లింది. "బాబూ, మరొకమాటు నువ్వు వెళ్ళి కనుక్కో." అన్నాడాయన మాచిన్నన్నయ్యతో. వాడువెళ్లి, కాళ్లుచేతులు పట్టుకొని, బ్రతిమాలి, అట్టహాసంమీద సూరన్నను తోడ్చుకొచ్చాడు.

సూరన్న మాకు దగ్గిరబంధువు. మాతాతగారి మేలువలన వాళ్లసంసారం బాగుపడింది. సూరన్న తండ్రి పాపన్న మావలన చాలా ఉపకారం పొందినవాడు. ఆయన గతించి సంవత్సరంపైగా కావచ్చింది. అతగాడు మంచి పేరుపడిన వైద్యుడు. చెయ్యికూడా మంచిది. చాలా గ్రంథం చదివినవాడు. కొన్నికొన్ని సాధనాలు స్వయంగా కనిపెట్టి, భద్రంగా రాసి ఉంచుకున్నాడు. మరణసమయమప్పుడు కొడుకును పిలచి, "సూరీ, యీపుస్తకం చదువుకొని, సాధనాలు ప్రయోగించు; అవి రెండో కంటి వాడికెవడికీ చూపించకు. రహస్యాలు తెలిసిపోతే వైద్యం క్రియ కట్టదు." అని చెప్పి, యేవో ఉపదేశాలు చేశాడట. సూరన్నకూడా తండ్రిమాటలు శ్రద్ధగా చెవినిపెట్టి, గ్రంథం చాలామట్టుకు వల్లించాడు. అదిగాక, పాపన్నగారి కుమారుడు కనుక, సూరన్నకికూడా వైద్యంలో గొప్పపేరు ప్రతిష్టలు లభించాయి. సూరన్నకీ డబ్బుకీ లంకె! పరువుకన్నా పైసా ప్రధానమని దేవులాడేవాడు. ఇప్పుడు వచ్చిన గట్టిచిక్కు యేమిటీఅంటే, అతను మాకు బంధువుడు, మావలన మేలు పొందినవాడున్నూ కాబట్టి మావద్ద పైసా నిలవదీసి పుచ్చుకోలేదు— పుచ్చుకోకుండా మందుపొయ్యడమంటే అతడికి మనస్కరించదు! ధైర్యంచేసి మావాళ్ళు పైసా యిస్తామని చెప్పలేరు. ఒకవేళ సూచావాచా అట్టిభావం తెలియజేస్తే, అతడేం తప్పువడతాడో అని బెంగ. 'చంకలోకురుపు; మామగారివైద్యం.' అన్న సామెతవలె వచ్చింది!

వైద్యుడు యింటికి రావడంతోటే అందరూ లేచి నిలబడ్డారు. పైటకొంగుతో అమ్మ కళ్లు తుడిచేసుకుంది. వంటయింటి తలుపు చేరవేసి, నాయనమ్మవచ్చి గదిగుమ్మంలో నిల్చుంది. ఎవరూ మాట, మంతిలేదు. వైద్యుడు కొంతసేపు నన్ను నిదానించి చూసి, "ఏదీ, అబ్బాయీ......చెయ్యిచూడనీ" అన్నాడు. నాడి పరీక్షించి ఆలోచిస్తూ ఊరుకున్నాడు.

"సూరన్నగారూ, జ్వరం ఎలాఉన్నదండీ? దిగుముఖానికి వస్తున్నదా?...పిల్లవాడు చాలా ఆయాసం పడిపోతున్నాడండీ!" అన్నాడు మానాన్న.

"ఊఁ..., ఎన్నాళ్ళయింది ఉష్ణంతగిలి?"

"మూడురోజులు"

"జ్వరం తీవ్రంగానే ఉన్నదండీ. బడియవేటు జ్వరంమోస్తరుగా కనిపించదు. నాడిలో వాతపైత్యగుణాలు రెండూ కనిపిస్తున్నాయి. విషమజ్వరం క్రింద దించుతుందేమో అని అనుమానంగాఉంది!... దగ్గుఉన్నదా?" అన్నాడు వైద్యుడు.

"ఉంది." అని నాన్న బదులుచెప్పాడు.

"అదగ్గువలన గుండెలో నొప్పిగా ఉంటుందంటాడు. పొడిదగ్గేకాని కఫంలేదు."

"అలాగనా? కఫం యేమీలేదా?"

"లేదు." అని చెప్పి, మానాన్న అమ్మవేపు చూసి, ఏం?...కఫం లేదుకదూ?" అన్నాడు.

ఆమె లేదని తలఊచింది.

"సరే, దానికేమీ భయంలేదు లెండి. గుండెలో నొప్పిగాఉంటే, చందనం అరగదీసి, పట్టువెయ్యండి. ఆనొప్పి తీసేస్తుంది." అన్నాడు వైద్యుడు.

"దాహం దాహం అని నీళ్లకోసం అల్లరి చేస్తాడండీ—గొంతుక ఆర్చుకొపోతూఉందని. యేదైనా సాధనంచేతురూ." అన్నాది అమ్మ.

"దాహంఉండడం ఎలాగా తప్పదు. ఉష్ణం విడిస్తేనేకాని ఆ దుర్దాహం కట్టదు. అడుగుతాడని మాత్రం నీళ్ళు పదేపదే యివ్వవద్దు." అన్నాడు సూరన్న.

"కాచిన నీళ్లు కొంచెంయిస్తే ఫరవాలేదు కదా అండీ?"

"వద్దమ్మా, అసలు నీళ్లే యివ్వకూడదు. కాచినదైనా నీరు జలుబుచెయ్యదూ? ఒక్కొక్కప్పుడు నీళ్లే చాలా ప్రమాదం చేస్తాయి. అంతగా కావలిస్తే, లవంగాలు రెండుకాల్చి యిస్తూఉండండి—అంతే!"

ఈలోపున మా చిన్నన్న గంధంసాన, తమలపాకులు, తేనెసీసా, బొగ్గులకుంపటి, గళానుతో మంచినీళ్లు, చిన్న రెండిగిన్నె అన్నీ తెచ్చి వైద్యుడి యెదట ఉంచాడు.

కాని సూరన్న లేచి నిలబడి, "ఇప్పుడు ఔషధం యేమీ అవసరంలేదు......భుక్తగారూ, మరి నేను సెలవు పుచ్చుకుంటాను" అన్నాడు.

"అయితే, ఔషధం యెప్పుడిప్పిస్తారు?" అని అడిగినాడు మా నాన్న.

"ఈ జ్వరంయొక్క నైజం ఐదురోజుల పిమ్మట కాని రూఢిగా తెలియదు. మరి రెండు రోజులు చూసి, అప్పుడు చికిత్స ప్రారంభించవచ్చును."

వైద్యుడి మాటలకు వెలవెలపోయి మా అమ్మ, "హారం యేమిటిమ్మన్నారు?" అని అడిగింది.

"లంఖణం మంచిది. 'లంఖనం పరమౌషధం!' అన్నారు మనవాళ్లు!' అయినా, అంతగా ఆకలిగా ఉన్నట్టయితే, కందికట్టూ, అన్నం పెట్టండి" అని సలహా యిచ్చాడు సూరన్న.

"చారు వెయ్యవచ్చునా, అండి?"

"కూడదు. చారుచల్లపోస్తే రోగం బలపడదూ!!"

"హారం లేనందున బొత్తిగా నీరసించి పోతున్నాడండీ! మంచంమీదినుంచి లేస్తే మనిషి తూలిపోతున్నాడు. పాలతో సగ్గుబియ్యం కాని, గోధుమనూక కాని జావకాచి యిస్తే?" అన్నాడు మా నాన్న.

"'వెఱ్రికుదిరింది; రోకలి తలకిచుట్టండి!' అన్నట్లుంది మీ మాట. పాలు పైత్యం కాదండీ? అంబా పెరిగిపోతుంది. అంత పత్యం చెయ్యలేనివాళ్లు నన్ను మందిమ్మని బలవంతంచెయ్యడ మెందుకు?" అని విరసంగా నవ్వాడు సూరన్న.

"తమ రట్లా ఆగ్రహించడం ధర్మమా? వైద్యులనే కదా శ్రమయిచ్చి మిమ్మల్ని అడగడం? తమ ఉత్తరువుకు వ్యతిరేకంగా చెయ్యం" అన్నాడు మా నాన్న.

"అయితే పత్యపానాల విషయమై నా సలహాను మీరు అక్షరాలా మన్నించవలసి ఉంటుంది. ఏమంటే యిది సాధారణజ్వరం కాదు. మనం కొంచెం జాగ్రత్తగా ఉండాలి. కీడెంచి మేలెంచమన్నారు పెద్దలు!" అని ముఖం గంభీరంగాపెట్టి చెప్పినాడు వైద్యుడు.

మానాన్న చాలా ధీరుడు. ఆకాశంవిరిగి మీద పడినా చలించని గుండెధైర్యం కలవాడు. సాధారణంగా సంసారంలో వచ్చే ఒడుదుడుకులకు భయపడే ప్రకృతి కాదతనిది. కాని ఎందువల్లనో వైద్యుడి మాటలకు కొంచెం బెదిరినట్లు కనబడినాడప్పుడు. ఎవడికీ, దేనికీ, ఎన్నడూ భయపడనివాడు సూరన్న బెదిరింపులకు సుతలాము లొంగిపోయి, అధైర్యంగా అంగవస్త్రంతో కన్ను లద్దుకున్నాడు, ముఖం ప్రక్కకు తిప్పుకొని. పుత్రప్రేమంటే అట్లా ఉంటుంది కాబోలు!

"పిల్లవాడిని మీ చేతిలో పెడుతున్నాం. వాడిని కాపాడేభారం మీది. 'వైద్యో నారాయణో హరిః' అన్నారు పెద్దలు. మీరు దేవుడితో సమానం!..,మీతో నేను మనవి చేయవలసినది యేమీ లేదు. సర్వం మీకు విశదమే. ఎంత డబ్బు ఖర్చయినా సరే, వెనకతియ్యను. పత్యపానాలు మీ ఆజ్ఞప్రకారం నడుపుతాం" అన్నాడు మానాన్న గద్గదస్వరంతో.

నాయనమ్మ గుమ్మందాటి కొంచెం ఇవలికి వచ్చి వైద్యుడివైపు తిరిగి, "బాబూ, సూరన్న బాబూ, మడిలో ఉన్నాను. ఒక్కమాటు యీ గుమ్మంలోకి వస్తావూ?" అన్నాది.

గదివిడిచి సూరన్న వరండాలోనికి వెళ్లాడు. చాటుకుపిలచి నాయనమ్మ అడిగింది, "నాయనా, కుర్రవాడికి మరేమీ ఫరవాలేదు కదా?"

"అవ్వగారూ, ఏం చెప్పగలం? ఆయుర్దాయానికి మనం కర్తలం కాము కదా? ఆ పరమేశ్వరుడి కృప!" అన్నాడు వైద్యుడు కొంచెం బిగ్గరగా.

* * * *

వంకాయలవారి గచ్చుచావడిలో అమ్మలక్కలంతా కూర్చుని, లోకభోగట్టాలు, తమతమ కష్టసుఖాలు, కాలక్షేపకబుర్లు చెప్పుకుంటూ ఉన్నప్పుడు నానేస్తం గుంపయ్య అక్కడ ఉండడం తటస్థించిదట. వాడు వచ్చి నాతో అన్నీ పూసగ్రుచ్చినట్లు చెప్పాడు. ఆడవాళ్ల కమిటీలో పడిన సంగతులకి సాధారణంగా తీగలు, కొమ్మలు పుట్టడం సహజం. వాటికి మరో రెండు చిన్నెలు, వన్నెలుపెట్టి, పువ్వులు కాయలు చేర్చి వర్ణిస్తాడు గుంపయ్య!...

జోగమ్మ—చూశా, వెంకూ! వాళ్ల పుల్లయ్యకి మందు పొయ్యనన్నాడట సూరన్న.

వెంకమ్మ—ఔను మరి,...రోగం నయమవుతుందని అతగాడికీ ధైర్యం తోచలేదు.

చాయమ్మ—(చాగోరివ మనిషి లేచికూచుని) అదికాదో వొదినా, అందులో ఉండే రహస్యం నేచెప్తాను విను. డబ్బు యివ్వరన్న భయంచాత సూరన్న అలా అని ఉంటాడు. అంతేకాని ఉష్ణం కుదరదనికాదు. మొన్న శాంభుక్తగారి కోడలికి పురిట్లో సెలపడేసినప్పుడు సూరన్న సాధించాడు కాదూ? వీళ్ల పిల్లడిది అంతకంటె పెద్దజబ్బు కాదు కదా? నిన్న సాయంత్రం నేను చూశాను. ఒళ్లు

మాత్రం కొంచెం వేడిగాఉంది. చక్కగా లేచి కూచుంటాడు. మాట్లాడతాడు. కొంచెం నీరసంగా కానొస్తున్నాడు. అంతే!

వెంకమ్మ—(పెదివి విరిచి) నా అనుమానం వేరు. ఏమైనా ఆశఉంటే, సూరన్న వదిలిపెట్టే మనిషి కాడు. డబ్బు రాదన్న భయం అతడికి ఎన్నడూ లేదు. బంధువులయేది, రొకవరటయేది—సానమీద రూపాయిలు పెట్టించుకొని మరీ మందుపోస్తాడు. మొగమాటం లేనివాడికి డబ్బురాదని భయమెందుకు? ఇంతకూ వాళ్లు డబ్బు లేనివాళ్లు కారు కదా? సమయం వచ్చినప్పుడు ముందు, వెనక చూడకుండా ఖర్చుపెడతారుకూడాను. ఒకవేళ వైద్యుడు మొగమాటం కొద్దీ పైసా అడగకపోయినా, అతగాడి కష్టం వాళ్లు ఉంచుకోరు. ఏదో ఒకవిధంగా ముట్ట చెప్తారు. సూరన్న వాళ్ల డబ్బు ఎన్నడూ తినలేదా యేమిటి? డబ్బు నయంకాదనే యేమీ పురస్కరించుకోక ఊరుకున్నాడు.

చాయమ్మ—పోనిస్తూ, అలాంటిమాట మనం అనకూడదు. ఇంతకూ వాళ్ళ అదృష్టం ఎలా ఉందో?

విశాలమ్మ—గవరయ్యాని పిలిపించి చూపిస్తే బాగుండును.

పార్వతమ్మ—ఔను సుమా. నాకూ అదే తోచింది. జ్వరం పీడసంబంధమేమో? లేకుంటే, ఏవరైనా ప్రయోగించారో?

విశాల—గవరయ్య మంత్రించి యింత విభూతి యిచ్చాడంటే, ఏదోషం ఉన్నా పోతుంది.

చాయ—మనం అనుకోడమేకాని, సుందరం మన మాటలు వినదే! దానికి చిల్లంగి, గిల్లంగి అంటే నమ్మకం లేదు. దెయ్యం, భూతం అంటేనే నమ్మదు!...ఇంట్లో దానిమాటే సాగుతుంది కాని, మరెవరిమాటా చెల్లదు.

పార్వ—ఎవరికీ దెయ్యంపట్టడం ఆమె చూడలేదేమో! అంతేకాని, ఆడదానికి దెయ్యం దేవత అంటే నమ్మకం లేకపోవడమేమిటి? దేవుడియందు నమ్మకం ఉంటే, దెయ్యాన్ని నమ్మి తీరాలి!

చాయ:—సుందరం మనలాటి పూర్వకాలం మనిషి అనుకున్నావా యేమిటి? చదువుకున్న పిల్ల. దాని తండ్రి గొప్ప పండితుడు.

చిట్టెమ్మ—కొంచెం నాగరీకంగా ఉంటుంది కాని, సుందరం చాలా ఉత్తమురాలు. చిన్నదైనా మంచి తెలిసిన మనిషి. న్యాయంపట్టి లోకంలో సవతితల్లుల కెవరికైనా తొలిసంబంధం పిల్లలమీద అభిమానం ఉంటుందీ? కాని సుందరంమట్టుకు సవతిపిల్లలందర్నీ తన సొంతబిడ్డలవలెనే చూసుకుంటుంది. ముఖ్యంగా యీ పుల్లయ్యాని చూస్తే, దానికి ప్రాణం.

చాయ—ఆమాట నిజమేకాని, కొంచెం తలతిక్క మనిషి, అది! దానికి రొంతతోస్తే అంతే కాని, ఒకరు చెప్పినట్లు వినదు. మొన్న నీమధ్య సూరన్న వాళ్లయింటికి పిల్లడిచెయ్యి చూడడానికి వెళ్లినప్పుడు, దాహానికి మంచినీళ్లు పదేపదే యివ్వవద్దని గట్టిగా చెప్పాడట. కాని వైద్యుడిమాట లక్ష్యపెట్టక, అడిగినప్పుడల్లా జ్వరంలో ఉన్న పిల్లడికి నీళ్లిచ్చేస్తూవుందట, ఆమె. ముసల్ది వొద్దమ్మా అని మందలిస్తే, "ఊరుకుందురూ, అత్తా! నీళ్లకు అపత్యమేమిటి?" అని అడ్డువాదన చేస్తుందట. లంఖణాలు, పథ్యపానాలు అంటేనే గురిలేని మనిషికి దెయ్యాలు, భూతాలు అంటే యేంనమ్మకం ఉంటుంది?

కనక—మీ కెవరికీ ఉన్న నిజం తెలియదు. సూరన్న మందివ్వకపోవడానికి నిజమైన కారణం యేమిటంటే, మందు పొయ్యమని వాళ్లు గట్టిగా నిర్బంధించలేదు—వాళ్ల పెద్దల్లుడు వొస్తున్నట్లు ఉత్తరం వచ్చిందట.

చాయ—ఎవరు? కామేశ్వరి మొగుడా?

కనక—అవును. అతగాడు పెద్ద యింగ్లీషు డాక్టరు కదూ మరి? అంచాత, సూరన్న వైద్యం

అవసరం లేకపోయింది. అదిగాక, సూరన్న వైద్యం అంటే, వాళ్లకి భయంకూడాను,—లంఖణాలుకట్టి, పాషాణం పెడతాడని! మనం యెరగమా యేమిటి సూరన్న వైద్యం? చచ్చినంతచేసి బ్రతికిస్తాడు. "బావ రానే వస్తున్నాడు, నేడో రేపో—మరెందుకు లెండి సూరన్నమందు?" అన్నాడట వాళ్ల రెండోవాడు, రామం.

జోగ—ముసిల్ది ఊరుకుందీ, మందిప్పించకుంటే?

కనక—ఆవిడేమాత్రం యేంజేస్తుంది? ఆమెకు మందులంటేనే నిగాలేదు. ఎప్పుడూ దేవుళ్లు, దేవతలు, మొక్కులు, తీర్థయాత్రలు—వీటిమీదనే దృష్టి. ఇదివరకే యే దేవుడికో మొక్కి, ముడుపు కట్టి ఉంటుంది; సందేహంలేదు.

వెంక—ఆమాట నిజమేను. పిల్లడి జబ్బు నయమైతే, భద్రాద్రిరాముణ్ణి సేవిస్తానని దండంపెట్టింది. ఆవిడేకు కలలో రామలక్ష్మణులు కానొచ్చారట! మంచి భక్తురాలు. ఎంత పుణ్యంచేసుకుందో! అన్ని తీర్థాలూ సేవించుకుంది. కాశి, రామేశ్వరం, శ్రీశైలం అన్నీ తిరిగింది.

చాయ—అయితే కనకం, ఎందుకొస్తున్నాడు, వాళ్లల్లుడిప్పుడు?

కనక—ఎందుకేమిటి? పెద్దపండుగ యింకా పది రోజులే కదా వుంది?

చాయ—రెండో అల్లుడుకూడా వొస్తాడా?

కనక—ఆదేమో.

విశాల—పోనీ అమ్మా, వాళ్ల పెద్దల్లుడే వొస్తే, యే బాధాలేదు. అభిమానంతో మందు పోస్తాడు.

వెంక—మందంటే పొయ్యగలడు కాని, ఆయుష్షు పొయ్యగలడా యేమిటి, ఎంత గొప్ప డాక్టరైనాను?

చాయ—ఏమైనా మరి సూరన్నకోసం ప్రాధేయపడ నక్కరలేదు కద.

విశాల—నయమే. సమయానికి వస్తున్నాడత గాడు.

కనక—పిన్నీ...ఉండు...(చెవియొగ్గి) ఏమిటా ధ్వని?...గంటల చప్పుడు వినరాలేదూ?

చాయ—ఔను, బండిచప్పుడే అది! బహుశః వాళ్ల బండే అయి ఉంటుంది. ఇక లేదాం మనం కూడా వంటకి ప్రొద్దు పోయింది.........

ఇంతలో రెండెడ్లబండి వచ్చి, మా యింటివద్ద ఆగింది; మా అక్కయ్యా, బావ బండిదిగి లోపలికి వచ్చారు.

మూడు పూటలు మా బావ ఔషధం యిచ్చేసరికి, నా జ్వరం వదిలింది. ఇంకొక వారం రోజులలో పూర్తిగా తేరుకున్నాను. జఠరాగ్ని తీక్షణం అయింది. ఉపద్రవమైన ఆకలి! నాయనమ్మ ధర్మాన చిరితిండికి యేమీలోటు లేకపోయింది. మా బావకి తెలిస్తేమాత్రం యేదీ తిననిచ్చేవాడు కాదు.